


# 27. పేరిందేవి

ఆ రోజు సాహిత్య సభలో ఒక యువ రచయిత కథానికనొకటి చదివాడు.

అగ్రహారంలో సోమయాజులపెళ్లాం అందానికి పేరు పడింది. అంత చక్కని పదహారేళ్ళ అమ్మాయికి దొరికిన ఇల్లరికపు మొగుడు ఏమంత బాగుండడు. చదువు సంధ్యలు అట్టేలేవు. సంగీత సాహిత్యాల మీద అతనికి ఎటువంటి అభిప్రాయమూ లేదు. ఎంత మందో ఆ అమ్మాయిని చేసుకుంటామన్నారు, కాని వాళ్ళు ఇల్లరికానికి అంగీకరించలేదు. ఆ అమ్మాయికి అమ్మమ్మగారి ఆస్థి చాల సంక్రమిస్తుంది. పదెకరాల పొలం, మామిడి తోట, అగ్రహారం మధ్యనో పెద్ద పెంకుటిల్లు ఆమెకు లభిస్తాయి. ఆమె నాన్న పోయిన తరువాత, ఆస్థి అంతా ఆమెకు, ఆమెను పెళ్ళి చేసుకున్న వాడికి చెందుతాయి. చదువు కున్న వాళ్ళెవరూ అగ్రహారంలో స్థిరపడడానికి ముందుకు రాలేదు. వెతగ్గా వెతగ్గా సోమయాజులు దొరికాడు, ఇల్లరికానికి అంగీకరించాడు. తాను ఇల్లరికం కుదిరినందుకు తన వాళ్ళకి సంవత్సరానికి సరిపడిన ధాన్యం అత్తవారిని కొలవమన్నాడు. ఆ విధంగా పేరిందేవి కన్నె చెర విడింది.

ఆ యువ రచయిత పేరిందేవి సౌందర్యాన్ని అవధులు దాటి వర్ణించాడు. అధరాలను అంతగా పట్టించుకోక పోయినా పయోధరాలను మ ట్టుకు విడిచి పెట్టలేదు. ఆమె కళ్ళు, నుదురు, బుగ్గలు, వాల్జడ, నడుము, పిరుదులు, ఊరువులు, ఈ విధంగా ఆమె శరీరావయా లను చాల గొప్పగా కొనియాడాడు.

సోమయాజులు గురించి కూడా రచయిత చెప్పాడు. ముఖం మీద స్ఫోటకం మచ్చలు, చెవులకు రింగులు, చుట్టకాల్చే అలవాటు; కొంచెం పొట్టిగా ఉండి, కళావిహీనంగా ఉంటాడు. అల్లుడు ఇంట్లో అడుగు పెట్టిన పది రోజులకే అత్తగారు చనిపోయింది. ఊరివాళ్ళ కళ్లన్నీ పేరిందేవి మీద ఉండడంలో ఆశ్చర్యమేముంది?

ఒకరోజు పేరిందేవి ప్రొద్దున్నే స్నానం చేసి ఊరిలోని దేవాలయానికి వెళ్ళింది. పక్క ఊరి జమీందారు గారు పేరిందేవిని అక్కడ చూడడం తటస్థించింది. అతనికి కళ్ళు చెదిరిపోయాయి. అతను తన ఊరు చేరుకోగానే పేరిందేవి కోసం మేనా పంపించాడు.

జమీందారుగారిని అందరూ రాజావారని అంటారు. సాయంకాలం రాజావారి లోగిలిలో హరికథ జరుగుతుందని, సోమయాజులను పేరిందేవిని వచ్చి ఆనందించమని అంతరంగికుడిచేత కబురు పంపించారు. రాజావారి ఆజ్ఞను తిరస్కరించే ధైర్యం ఎవరికీ లేదు.

ఆ రాత్రి హరికథ ముగిసేసరికి పన్నెండయింది. సోమయాజులుకి మస్తుగా తిండిపెట్టి, పల్లకీలో పదిగంటలరాత్రివేళ అగ్రహారంలో యింటివద్ద రాజుగారి శిష్యులు విడిచిపెట్టారు.

మర్నాడు ఉదయం ఏడు గంటల వేళకి పేరిందేవి మేనాలో యిల్లు చేరుకుంది. ఆమె చాల నలిగిపోయింది. నిద్రలేక కళ్లు ఎరుపెక్కాయి. అందరూ చూస్తుంటే ఆమె పల్లకి దిగింది. తనవేపు చూస్తున్న ఇరుగుపొరుగుల వారికి రాజావారు బహూకరించిన పదిహేను తులాల బంగారు కంటె కనిపించేట్టు పయ్యెద సర్దుకుని ఇంట్లోకి నడిచింది.

కథానిక అంతటితో ముగిసిపోయింది. 'పేరిందేవి కంటె' అని దాని పేరు. అందులోని పాత్రలు, నిజమైనవారని సంఘటనలు జరిగినవేనని, అగ్రహారం ఈనాటికి కూడా ఉందని అతను సభలో చెప్పాడు.

తరువాత సభికులు ప్రశ్నలు వేశారు

రచయితకు అగ్రహారమెక్కడుందో తెలియదు. సోమయాజులుకాని, రాజావారిని కాని అతను చూడలేదు. ఆ మధ్య, వారింటికో ముసలావిడవచ్చి రచయితకు ఈ కొద్ది వివరాలు చెప్పి కథ రాసుకోమంది.

ఇంక అతనినే వివరాలు అడగగలం?

నేను చిన్న తనంలోనే ఢిల్లీ వెళ్ళిపోయాను. అక్కడే, చదువు, ఉద్యోగం, పదవీవిరమణ అన్నీ జరిగాయి. ఆంధ్ర దేశం విడిచిన నలభై రెండు సంవత్సరాల తరువాత విశాఖపట్నం కుటుంబంతో తిరిగివచ్చి, బీచి రోడ్డులో ఒక ఫ్లాటు కొనుక్కొని స్థిరపడ్డాను. సాహిత్యాభిమానిని అవడంచేత వారం వారం సభకు వచ్చి, వినడమో, వ్రాసినది చదవడమో చేస్తుంటాను.

ఇవాళ నామనసు దారితప్పింది.

నాకీ అగ్రహారం తెలుసు. పేరిందేవి తెలుసు- ఆమె తల్లిగారు తెలుసు- సోమయాజులు తెలుసు.

పేరిందేవి గురించి కుర్ర రచయిత సరిగా వర్ణించలేదు. ఆమె నీళ్ల తాగుతుంటే గళంలో అవి కనిపించేవి. ఆమె నడక మదమరాళగమనం- ఆమె కన్నులు తామర పూవురేకుల వలె విశాలంగా, ఆ చూపులు సమ్మోహనంగా ఉంటాయి. ఆమె మాటలలో తేనియలు; ఆమె హృదయంలో అమృతం- ఆమె పాటలో మాధుర్యం- ఆమె కాలిమట్టెల శబ్దంలో లయవిన్యాసాలు- ఆమె జ డ త్రాచులా పిరుదులపైనాట్యం చేస్తుంటే మనసు వశం తప్పుతుంది.

మా అమ్మమ్మగారి ఊరు అగ్రహారం- పేరిందేవి గారి యింటి పక్కనే మా వాళ్ల యిళ్లు. ఏ రెండేళ్ళకో, మూడేళ్లకో ఒకసారి ఎండకాలం సెలవుల్లో అగ్రహారం వేళ్తే పేరందేవిని చూడడం జరిగేది. చిన్నప్పుడు ఆమెతో అంతగా పరిచయంలేదు. ఆమె నాన్నగారు మంచి పండితుడు. సంగీత జ్ఞానమున్నవాడు- అతనిదగ్గిర ఆమె సాహిత్యం సంగీతం నేర్చుకుంది. అతను పోవడంతో ఆమె బ్రతుకు నడివీధిని పడింది. అమ్మమ్మ గారి విల్లు ప్రకారం ఆమె పెళ్లి చేసుకుంటేనే, ఆమెకు ఆస్తి దక్కుతుంది.

నేను ఇంటర్మీడియట్ పరీక్షల తరువాత అగ్రహారం వెళ్లాను. అదే ఆఖరిసారి. అప్పటికి పేరిందేవికి పెళ్లయింది.

పేరిందేవి భర్త అంతగా జ్ఞాపకం రాలేదు. మావాళ్ల పెరటికి, వాళ్ల పెరటికి మధ్యనున్న గోడ పొట్టిది. పెరటిలో ఆమె అప్పుడప్పుడు కనిపించేది. అంత చక్కని మనిషి- నాకు యౌవనప్రాదుర్భావమవుతున్న రోజులు- సహజంగా నేను సౌందర్యారాధకుడిని. పొరుగున ఉన్న అమ్మాయికి పెళ్లయిందని, కొద్ది రోజులలోనే కాపురం చేయబోతున్నదని తెలిసి, ఆమె వేపు సూటిగా చూడలేకపోయేవాడిని.

సెలవులు అయిపోవచ్చాయి. మరునాడు ఉదయమే వెళ్లిపోవాలి. ఉన్నట్టుండి నాకో ఆలోచన తట్టింది. ఆమెను కలిసి, అంత సౌందర్యరాశిని నేను ఎక్కడా చూడలేదని చెప్పాలనిపించింది.

అప్పటికి మధ్యాహ్నం మూడు గంటలే అయింది. ముఖమొకసారి అద్దంలో చూసుకొని,. క్రాఫింగ్ సరిచేసుకొని, మడతచొక్కావేసుకోని మరీ వాళ్లింటికి వెళ్లాను.

ముందు విశాలమైన వరండా దాటితే పెద్ద గది వస్తుంది. అందులో పడక కుర్చీలో కూర్చొని పేరిందేవి పుస్తకమేదో చదువుకుంటున్నది.

గది గుమ్మం దగ్గిర నిలబడి చిన్న దగ్గు దగ్గి అన్నాను.

"నమస్కారం,పేరిందేవి గారు!'

ఆమె తలెత్తి నావేపు చూసింది.

ఆచూపే చాలు పదివేల వరహాలు

ఆమె నావేపో అయిదు నిమిషాలు చూసి అంది.

"గుమ్మం దగ్గిర నిలబడిపోయావేం, రాలోపలికి"

బెదురుతూ లోపలికి వెళ్ళాను.

" ఆ మంచంమీద కూచో, పిమ్మట చెప్పు ఎందుకొచ్చావో!"

ఆవిడ చెప్పినట్లే మంచంమీద కూర్చున్నాను. తరువాత మెల్లిగా అన్నాను.

"రేపు ఉదయంవెళ్లిపోతున్నాను. మీతో చెప్పి వెళ్లాలని వచ్చాను

నావేపు లోతుగా చూస్తూ అడిగింది.

"ఇంతేనా? ఇంకేవేనా చెప్పడానికున్నాయా?"

"మీరేమేనా అనుకోనంటే, ఒక సంగతి చెప్పాలని వచ్చాను."

గది నలువైపులా చూశాను.

"ఇంట్లో ఎవరూ లేరు. మా అమ్మ మా అత్తవారింటికెళ్ళింది. ఏవో ముహూర్తాలు పెట్టించడానికి. జంకులేకుండా చెప్పు".

"నేను చాల మంది వయసులో నున్న అమ్మాయిలను చూశాను. కాని, మీకు మల్లే, సౌందర్యమంతా పోతపోసి తీర్చిన బంగారు బొమ్మను చూడలేదు. మీరు ఎంత అందమయినవారో, అంత హృదయమున్నవారు. మీరు ప్రాణసమానంగా పెంచే పూలమొక్కలను,అంత ఆదరంతోనే మాటలు నేర్పే రామచిలుకను నేను రోజూ చూస్తున్నాను. మీరు చిలుకకు నేర్పే మాటలు, పూలమొక్కల మధ్య పచారులు చేస్తూ లలితమైన కంఠంతో పాడే పాటలు వింటూ పరవశిస్తున్నాను. రేపు, ఇటువంటి రమ్యమైన వాతావరణాన్ని విడిచిపెట్టి వెళ్లాలంటే నా మనసు బాధపడుతున్నది. ఏంచేయడం? ... వెళ్లక తప్పదు."

ఆమె లేచి నా దగ్గిరకి వచ్చింది. నా భుజాలెత్తి నిలబెట్టింది. నన్ను గాఢంగా కౌగలించుకుంది.

"శర్మా! ఎంత చక్కని మాటలు విన్నాను. రోజూ నిన్ను చూస్తునే ఉన్నాను. ఒంటరిగానున్న అమ్మాయిపై ఏ దొంగ చూపులూ నువ్వు కుమ్మరించలేదు. చాల మర్యాదగా ముఖం దించుకొని ఇంట్లోకి వెళ్లిపోతున్నావు. నీకు మంచి సంస్కారముంది. నీకిచ్చే బహుమతి ఏమిటోతెలుసా. ఎవరికీ ఈయని తొలిముద్దు!"

ఆవిధంగా గులాబిరేకుల మెత్తదనం ఎటువంటిదో ఆనాడు నాకు తెలిసింది.

ఎండాకాలం రమారమి ముగుస్తోంది. మధ్యహ్నం మూడు నుండీ మబ్బులు ఆకాశంలో నిండి సూర్యుడిని కప్పుతున్నాయి. రోజూ ఈ మధ్య ఇలాగే జరుగుతున్నది. ఇవాళ కూడా వెలుతురు సన్నగిల్లింది. పెద్దగాలి వచ్చింది. గాలితో పాటు జోరుగా వర్షం- దానితో మెరుములు, ఉరుములు, పిడుగులు- పేరిందేవి గారింట్లో చీకటిపడే వరకు ఉండిపోయాను.

మరునాడు కోడికూతవేళకే బయలుదేరి, ఎవరికీ చెప్పకుండా గ్రామం విడిచిపెట్టాను.

అటుతరువాత చాల తొందరగా మార్పులు జరిగాయి. మా మేనమామకు న్యూఢిల్లీ బదిలీ అయింది. నన్ను కూడా ఆయన తీసుకు పోయాడు. అతనికి పిల్లలు లేరు. నేను అక్కడే చదువుకున్నాను- చాల పెద్ద ఉద్యోగం నుండి రిటైరయి, విశాఖపట్నంమీద మమకారం విడిచిపెట్టలేక, వచ్చి యిక్కడ స్థిరపడ్డాను.

ఆ రాత్రి నాకునిద్ర పట్టలేదు. కుర్రరచయిత మధ్యంతరంగా నన్ను సందేహంలో పడవేశాడు

పేరిందేవి పట్ల నేను తీరని అపచారం చేశాను.

ఆమెను కలియడం మాట అటుంచి, కనీసం ఆవిడ సంగతులు తెలుసుకోడానికి కూడా నేను ప్రయత్నించలేదు.

ఆమె జీవించి ఉందా?

ఉంటే ఎలా ఉంటుంది?

చక్కని ఆమె జుట్టులో అక్కడక్కడ వెండి తీగలు.

పిల్లా పాప కని ఆమె అందం ఎలా మారిందో!

వేటికి జవాబులు లేవు.

'బంగారం కంటె' ఎపిసోడ్ చాల చేదుగా ఉంది.

ఆమెకు తాళి కట్టిన మొగుడిని చూస్తే, ఆమె చేసిన పని తప్పుకాదనిపిస్తుంది.

ఏదైతేనేం, ఆమెనొకసారి చూడాలి.

మర్నాడు ఉదయం ఇంట్లో చెప్పి అగ్రహారానికి బయలు దేరాను. పాలకొండ చేరేసరికి మధ్యాహ్నమయింది. అక్కడో హూటలులో భోజనం చేసి, మరో బస్సు పట్టుకొని అడ్డరోడ్డు దగ్గిర దిగి అగ్రహారానికి నడిచి వెళ్లాను. సరిగ్గా మూడు గంటలకి, పేరిందేవి ఇంట్లోకి తొలిసారి ప్రవేశించినవేళకే, వాళ్లయింటి ముందు నిలబడ్డాను.

పొరుగునున్న మావాళ్లు అగ్రహారం విడిచి చాల ఏళ్లయింది. మరెవరో ఆయింట్లో ఉంటున్నారు.

అగ్రహారం అప్పటికీ, ఇప్పటికీ ఒక్కలాగే ఉంది.

మట్టి వీధులు, మురుగు కాలువలు, పశువులు కట్టిన సావళ్లు, పెంకుతిరగేయని ఇంటిపై కప్పులు- అన్నీ, ఆనాటికన్న ఇంకా క్షీణ దశలో ఉన్నాయి.

ఆ గ్రామం లోని పెద్ద కుటుంబాల పిల్లలు పట్నాలకు చదువులకు పోయి, పైఊళ్లలో ఉద్యోగాలు చేస్తూ దగ్గిర వాళ్లను తమ వెంట తీసుకుపోయారు.

అన్నిటికంటే మార్పు చెందినది నా ఎదురుగా నున్న పేరిందేవిగారిల్లు . దానిపైకప్పు పడిపోయింది. గోడలు కూలిపోయాయి. వీధిలోంచి పెరడు కనిపిస్తున్నది. పూలమొక్కలకు బదులు పొదలతో అది నిండిపోయింది.

పేరిందేవిని చూడడం మాట అటుంచి, ఆమె గురించి చెప్పే వాళ్లు కూడా వెంటనే దొరకలేదు.

ఇరుగు పొరుగులను అడిగితే, ఏదో తప్పుమాటను విన్నట్లు వాళ్లు చెవులు మూసుకొని, నన్ను వెళ్లిపొమన్నారు.

ఒక అరగంట వరకు ఎక్కేగడప ఎక్కి, దిగే గడప దిగి, చివరకు రామాయమ్మ గారిని కలిశాను. ఆమె నావేపు చాలసేపు చూసి అంది.

"నువ్వు శర్మవు కదూ!"

"అవును- పేరిందేవి గారేమయారు?" అడిగాను.

"నీకోసం చూసి చూసి ఈ లోకం విడిచి విళ్లిపోయింది."

తలమోదుకుంటూ వాళ్ల గుమ్మంలో కూర్చుండిపోయాను. తరువాత నదికిపోయి సచేలంగా స్నానంచేసి వచ్చాను. బట్టలు మార్చుకొని, రామాయమ్మ గారి వీధి వరండాలో బెంచిమీద కళ్లనీరు కారుతుంటే కూర్చున్నాను.

రామాయమ్మగారు వేదాంత వాక్యాలు వినిపించి, రాత్రికి భోజనం పెట్టారు.

"శర్మా! నీకోసం ఆమె పది సంవత్సరాలు ఎదురు చూసింది. ఎంతవాకబు చేసినా నీచిరునామా దొరకలేదు. నిన్ను ఎవరూ చూసినట్లు కూడా చెప్పలేదు. ఆమె నిరాశ చెందిందని చెప్పలేం. ఏదోరోజు నువ్వు వచ్చి తన గురించి అడుగుతావని ఆమెకు నమ్మకముంది. ఇది నిజమేనంటావా"?

"నేను ఎంత దురదృష్టవంతుడిని. ఆవిడ బ్రతికుండగా కలియలేకపోయాను."

"చాలా విషయాలు ఆమె ఎవరితోను చెప్పుకోలేకపోయింది. నీ ఒక్కడితో చెప్పాలనుకుంటే అది జరగలేదు. అయినా ఆమె నిరాశ పొందలేదు. తన ఆస్తి గురించి విల్లు వ్రాసింది. తాళం వేసిన రంగంపెట్టి ఒకటి నీకిమ్మని యిచ్చింది. నీకొక పెద్ద ఉత్తరం వ్రాసి యిచ్చింది. మాయింట్లో ఎలక్ట్రిక్ దీపాలు లేవు. చిన్న లాంతరుంది. దాని వెలుతురులో ఉత్తరం చదువుకోగలవా? లేకపోతే సావకాశంగా రేపు పగటివెలుతురులో చదువుకోవచ్చు."

ఆయింట్లో మరో యిద్దరు ఆడవాళ్లున్నారు. వీధి వరాండా చివరకు చిన్న కొట్టుంది. అందులో ఒక టేబిలు, కుర్చీ ఉన్నాయి. రామాయమ్మగారు కాగితాలు యిచ్చారు. పెట్టి చాల బరువుంది. పక్కింటి కుర్రాళ్ల చేత దానిని కొట్లో పెట్టించారు

గుండెలు కొట్టుకుంటుంటే, దీపం పెద్దది చేసి టేబిలు దగ్గిర కూర్చున్నాను. ఆమె వీలునామా రెండు పేజీలుంది దానిని వెనక నుంచాను. ఆమె ఉత్తరం హెచ్చుపేజీలలో ఉంది. దానిని ముందు చదివాను.

"శర్మా!

ఏదో రోజు నువ్వు వస్తావు. నా గురించి అందరినీ అడుగుతావు. వాళ్లేం చెప్పగలరు? నాతోనే నా రహస్యాలు అంతరించి పోతాయనుకున్నాను. నా ఆనందాన్ని నీతో పంచుకున్నట్లే, నామనోవ్యధను కూడా నీకు తెలియజేస్తే నా హృదయం శాంతిస్తుందని ఈ పనికి పూనుకున్నాను.

నా మొగుడు యింట్లో కాలు పెట్టిన పదిరోజుల్లో మా అమ్మ పోయింది. లంకంతయిల్లు. ఎలుగుబంటి వంటి మొగుడు. ప్రతిరాత్రి అతను నన్ను మానభంగం చేస్తూనే ఉన్నాడు.

అతనేం చేసినా చట్టం అంగీకరిస్తుంది. అగ్రహారంలోని రసికులు నా భర్తను చేరదీసి, నా యింట్లోకి ప్రవేశించడానికి ఉచ్చులు బిగించారు.

నేను మెలకువగా లేకపోతే అగ్రహారపు పురుషులందరికీ ప్రియురాలిగా మారేదాన్ని.

ఒకరోజు ఉదయమే స్నానం చేసి దేవాలయానికి వెళ్లాను. రాజాగారు లోపల పూజచేస్తున్నారని, ఎవరూ లోపలికి వెళ్లడానికి వీలులేదని అతని మనుషులు మమ్మల్ని ఆపేశారు. అందరం పావుగంట ఆలయద్వారం దగ్గిర పడిగాపులు కాసిన తరువాత రాజావారు పైకివచ్చారు. అతని చూపులు నామీదనే నిలిచి నా వంటికి అతుక్కుపోయాయి. ఆయన పట్టు పంచ కట్టుకున్నారు. వోణీ పైన వేసుకున్నారు. అతని ఉంగరాల జుత్తు విశాలమైన ఫాలంమీద గాలికి కదులుతున్నది. కొంచెం పొడవుగా, బంగారపు దేహకాంతితో, ఆడవాళ్లను ఆకర్షించే చక్కదనంతో అతను నా ఎదుట నిలబడ్డారు. చెవిలోపెట్టిన సంపెంగపువును నా వక్షంమీదికి విసిరారు. ఆ పూవు అక్కడేనిలిచింది. దాని తీసి విలాసంగా కొప్పులోపెట్టుకొని, ఆతని వేపు ఒకచూపు బాణం విడిచాను. అతను ఉబ్బి తబ్బిబ్బయ్యారు.

ఏదో సరదాకు చేసిన పని పీకలమీదికి వచ్చింది. సాయంకాలం మా వాకిట్లో రాజావారు పంపిన మేనా మా దంపతులకోసం వచ్చింది. జమీందారు గారి మనుషులు ఆ రాత్రి నా భర్తకు మస్తుగా మేపి వరండాలో పడుక్కోబెట్టారు. మరునాడు ఉదయం వరకు నేను రాజావారి శయనాగారంలో, హంసతూలికా తల్పంమీద, నిలువుటద్దాలమధ్య ఉజ్వలమైన దీపకాంతిలో ఆ నలభైయేళ్ళ మనిషి ఆరాధనలో ఉండిపోయాను.

ఆతను జమీందారుకు పెద్ద, రాజుగారికి చిన్న. అయినా అందరిచేత రాజావారని పిలిపించుకుంటారు. అతను మహారసికులు. అందమైన స్త్రీ ఎక్కడ కనిపించినా ఆమెను అనుభవించి తీరవలసిందే. ఇంట్లోని భల్లూకంనుండి తప్పించుకొని, కోటలోని పులినోట్లో చిక్కుకున్నాను.

అప్పటినుంచీ నా జీవితం పూర్తిగా మారిపోయింది. మా యింట్లో దాసదాసీలు- వంటలక్కలు- నా మెడలో వారానికో కొత్త బంగారు నగ. తొలిరోజుల్లో అప్పుడప్పుడు రాజావారి దగ్గిరికి వెళ్లినా, క్రమంగా వారాలతరబడి అక్కడే ఉంచేవారు. నేను అతని ప్రాపు చేరినతరువాత, మరే స్త్రీమీద అతను మరులు పడలేదు.

రాజావారి భార్యను రాణీగారని పిలిచేవారు. వారాల కొద్దీ వారి భవనంలో నన్నుంచుకుంటే, నా దయ సంపాదించడం కోసం అందరూ నన్ను చిన్న రాణిగారని పిలిచేవారు. అప్పుడప్పుడు తగవులు తీర్చడంలోను,సలహాలు చెప్పడంలోను రాజుగారికి నేను సాయపడేదాన్ని.

నా రాకతో పెద్దరాణిగారు తెరవెనక్కిపోయారు. ఆవిడపూజలు, ఉపన్యాసాలు, భజనలు, - ఆదోలోకం. రాజుగారెవరో తెలియకుండా ఆమె పుణ్యస్త్రీగా పరమపదించారు.

రాజుగారు అరవై సంవత్సరాలలో బ్రతకవలసిన జీవితాన్ని ఒక్క పదేళ్లలో ముగించారు. నిరంతరం నన్ను శ్రమపెట్టి తాను శ్రమపడి, రోజురోజుకు పెరిగిన కామాన్ని నిగ్రహించుకోలేక, ఒక సాయంవేళ రంభాది దేవకాంతల దగ్గిరకి వెళ్లిపోయారు. సాధారణంగా కోరిక మిగిలిన రాజులు స్వర్గానికే పోతారట.

రాజావారికి సంతానం లేదు. వారి ఏలుబడిలో పదిహేను గ్రామాలున్నాయి. పెద్దభవనం- వందలకొద్దీ పరిచారకులు- రాజుగారు పోయినందుకు అతని వాళ్లెవరూ విచారించలేదు. నేను అతని జీవితంలో ప్రవేశించిన తరువాత వాళ్ల కష్టాలు తగ్గాయని అన్నారు. అతను అహర్నిశలు నాతోనే ఉండడంచేత, నా సలహాలను కొన్నింటిని పాటించడంచేత, వాళ్లు సుఖంగా ఉన్నారట. నన్నా సామ్రాజ్యాన్ని ముందుకు నడిపించమని, చిన్న రాణిగా నన్ను గౌరవిస్తామని ఏకకంఠంతో పలికారు.

నేను తిరిగి ఈ నరకంలో ప్రవేశించడానికి నాకు మనస్కరించలేదు. ప్రభుత్వాధికారులకు వ్రాసి , వార్రికి రాజావారి ఆస్తులనన్నిటినీ అప్పగించాను. ప్రజలేప్రభుత్వం- ప్రభుత్వమే ప్రజలు- ఈరాచరికపు మోహంలోంచి వాళ్లను వైదొలగ మన్నాను.

నన్ను పట్టిపీడిస్తున్న పీడకలనుండి విముక్తనయాను. అగ్రహారం తిరిగివచ్చాను. నాయింట్లో ప్రవేశించాను. ఇప్పుడేనేను ఒంటరికత్తెను. రాజుగారి దాసదాసీలను పంపించివేశాను. రాజుగారి ప్రాపులో చేరిన మొదట రోజులలో, నాభల్లూకం భర్త, స్నేహితుల మాటలు విని, నన్ను మానభంగం చేయడమే కాకుండా, ముఖం మీద చురకలు పెడతానని బెదిరించాడు. ఈ విషయం రాజావారితో మనవి చేస్తే, నాభర్తను ఎక్కడికి రవాణా చేశారో భగవంతుడికే తెలియాలి. అతను ఇంట్లో ఉండడం వల్ల కొత్త సమస్యలు తలెత్తేవి. ఇప్పుడు ఆబాధకూడా లేకుండా పోయింది.

ఇల్లు సర్దుకున్నాను. తిరిగి సామాన్యజీవితానికి మళ్లాను.

ఒంటరిగా ఉన్న స్త్రీ నలుగురికీ లోకువే. అందులో అందంగా ఉండే నావంటి దానికి అన్నీ యిబ్బందులే. గ్రామంలోని పెద్దమనిషి ఒకడు రోజు నాదగ్గిరకి వచ్చి నామంచి చెడ్డలడిగి, ఊళ్లో నలుగురి సంగతులు చెప్పేవాడు. క్రమంగా అతను చొరవతీసుకొని, ఫలానా అతను మంచి ధనవంతుడని, మరొకడు రసికుడని, మరొకడు వస్తాదని, వాళ్లందరూ నా స్నేహం కోసం ఎదురు చూస్తూన్నారని, బ్రతికే కొద్దిరోజులు హాయిగా బ్రతకమని సలహాయిచ్చాడు.నేను కోపం పట్టలేకపోయాను. కర్ర తీసుకొని ఆ తార్పుడుకాడిని చావమోదాను. అలిసిపోయి చివరకు ఒక మాటన్నాను.

'వంద సంవత్సరాలు బతకవలసిన రాజావారు నన్ను తీసుకెళ్లి ఏభై సంవత్సరాలకే చనిపోయారు. నువ్వు చెప్పిన వాళ్ళకు కాలం మూడితే నాదగ్గిరకి పంపు'.

ఆమహానుభావుడు గ్రామంలోని మగళ్లందరితోనూ, నేను కామినీపిశాచాన్నని, రాజుగారిని తినేశానని, ఏ పురుషుడైనా నా అందానికి లొంగి వెంటబడితే తొందరగా చచ్చిపోతాడని

ప్రచారం చేశాడు. చావుకు తెగించి ఏమగాడు నా దగ్గిరకి రాడానికి సాహసించలేదు.

ఈ బెడద అంతటితో పోయినందుకు చాల సంతోషించాను.

రోజూ, ఒంటరిగా, సోమరిగా కాలం గడపడం నాకు కష్టమనిపించింది. ఇరుగుపొరుగులకు పనులలో సహాయం చేసి, మాటామంతీ ఆడి, నాకు ఏటా వచ్చే మామిడికాయలు పంచిపెట్టాలని అనుకున్నాను.

నేను వీధిలోకి వెళ్లినప్పుడు, చిన్నపిల్లలు నావేపు వచ్చేవారు. వాళ్లను బుజ్జగించి మాట్లాడుతుంటే, తల్లులు పరుగెత్తుకొనివచ్చి, పిల్లలను లోపలికి తీసుకుపోయి దభాలున ఇంటితలుపులు మూసుకునేవారు. ఒకటి రెండిళ్లేకాదు, ఊళ్లో వాళ్లందరూ ఇదేపనిచేశారు. నేను వాళ్లకు పంపిన మామిడికాయలను గోతుల్లో పారేశారు. నేను మంత్రకత్తెనని, నా దృష్టి తగిలితే పచ్చని చెట్లు మాడిపోతాయని, పిల్లలు బతికిబయటపడరని నా ఎదుటే అనడం మొదటు పెట్టారు.

మొదట్లో, రాజావారు నాకు ప్రతివారం బహూకరించిన బంగారు నగలను, ఏ దొంగలో దోచుకుంటారని భయంగా ఉండేది. ఈ భయానికి అనుగుణంగా, ఒక రాత్రి దొంగొకడు పెరటిగోడ గెంతి, నా పడకగదికి కన్నం చేయడం మొదలుపెట్టాడు. ఆ పాతగోడ, గునపం దెబ్బలకు నిలవలేక, సగంభాగం వాడిమీద పడింది. అక్కడికక్కడే వాడు చచ్చాడు. మరో యిద్దరు కూడా ప్రయత్నించారు. ఒకడు పాము కరచి, మరొకడు మండ్రగబ్బ కరిచి- ఇద్దరూ చచ్చిపోయారు. నారంగం పెట్టెను నడివీధిలో పారేసినా దగ్గిరకెవ్వడూ రాకుండాపోయింది.

నేనేం నేరం చేశాను?

భర్తచాటున బ్రతుకుతూ, పై వాళ్లతో సంబంధాలు పెట్టుకున్న వాళ్లు చాలమంది నాకు తెలుసు. వాళ్లకీ యిబ్బందులు లేవా?

నేనవరిని నిందించాలి?

ఎవరిని నిందిస్తే ఏంప్రయోజనం?

చేయని నేరాలకి శిక్షలనుభవించేవారిలో నేనూ చేరిపోయాను

ఇంట్లో, అన్నీ ఉండి ఖైదీగా జీవించాను.

ఏదోరోజు నువ్వు వస్తావని చూశాను.

ఈ ఉత్తరం ముగించక ముందు నేను వ్రాసిన వీలునామా చదువుకో. నాకున్న ఆస్తి సర్వం నీకు వ్రాస్తున్నాను. నీకన్నా ఆప్తులు నాకెవరూ లేరు.

అంతవరకు ఉత్తరం చదివి, ఆపి, వీలునామా చదివాను.

"నాపేరు పేరిందేవి. నా మనస్సు సరిగా ఉన్నప్పుడు ఈ వీలునామా వ్రాస్తున్నాను. నేను పది సంవత్సరాలు రాజావారి ఉంపుడు కత్తెగా ఉన్నాను. వారు తరచు నాకు దివాణం

వారి జవహారీ నుండి బంగారు నగలు తీసి బహూకరించేవారు. ఈ బంగారు నగలు తూకం వేయిస్తే ఇరవై వీశల బరువున్నాయి. నేను వారికి శారీరకమైన సౌఖ్యం ఇచ్చినందుకు నాకు ముట్టిన ప్రతిఫలమిది. ఈ సంపదను నాకు తోచిన వారికి యివ్వవచ్చు; లేక అమ్మనూ వచ్చు. నాకు ఒక సంగతి తెలిసింది. కరువు కాటకాలు వచ్చినపుడు తమ ప్రజలనుండి బంగారు నగలను కుదువ బెట్టుకొని వారికి రాజావారి తల్లిగారు ధాన్యాలు కొలిచారట. ప్రజలు మరి విడిపించుకోలేకపోగా, ఆ బంగారాన్ని కరిగించి ఆభరణాలుగా చేయించారు. ఈ సంగతి తెలిసిన దగ్గిర నుండీ ఒక నగ కూడా నేను తాక లేదు. ఇవి ప్రజల సొత్తు. వారికి ప్రభుత్వం వీటిని అందించగలదో లేదో తెలియదు. ప్రభుత్వం ప్రజల మంచి చెడ్డలను విచారిస్తుంది. వారి కొరకు ఖర్చు పెడుతుంది. రాజుగారి ఆస్తి అంతా ప్రభుత్వానికి చేరింది. ఈ బంగారం కూడా ఖజానాకే చేరాలని కోరుతున్నాను. ఆపని శ్రీ శర్మగారికి అప్పగిస్తున్నాను. మిగిలిన నా ఆస్తులన్నీ శ్రీ శర్మగారికే స్నేహపూర్వకంగా అర్పిస్తున్నాను. - సంతకం - పేరిందేవి.

అప్పటికి బాగా తెల్లారిపోయింది.

గది గుమ్మం దగ్గిర రామాయమ్మ గారు నిలుచున్నారు.

"ఉత్తరం పూర్తిగా చదివావా?"

"కొంచెం ఉండిపోయింది."

చివరిపేజీ చదివాను.

"శర్మ- నేను చాల చక్కనిదానవన్నావు- నా హృదయం అంతకన్న అందమైనదన్నావు. జీవితాన్ని సౌందర్యదృష్టితో ఆరాధించమన్నావు. కాని, సమాజమనే ఈ త్రాచుపాము కాటుకి బలి అయ్యాను. ఇంకేం చెప్పను. మన ప్రథమసమాగమానికి, నా చిన్నప్పటినుంచీ మెడలోనున్న ముత్యాలహారం సాక్షి. అది నా మెడలో ఉండి దివ్యమైన అనుభూతులను వెలికి తీసి నేను బ్రతకడానికి సహాయం చేసింది. దానిని మాత్రం స్వీకరించు. నీమెడలో అది నన్ను జ్ఞాపకం చేస్తుంది . రామాయమ్మగారి చేతిలోంచి తీసుకొని మెడలో నా ఎదురుగా రామాయమ్మ గారు - ఆమె చేతిలో ముత్యాల హారం - అది నా మెడలో ఎవరికీ చెప్పలేని దివ్యానుభూతులకు సాక్షి.

రచన - మాసపత్రిక ○